# మేల్కొన్న మానవులు

కృష్ణాతీరాన ఉన్న ఆ పల్లెలో గ్రామదేవత ముత్యాలమ్మకు కొలుపులుచేసే రోజు దగ్గిరపడుతోంది. కొలుపులు ఐదురోజులు జరుగుతాయి. మొదటి మూడురోజులు వూళ్లో ఘటం తిరుగుతుంది. చాకలి పసుపు కుంకుమ రాసిన బాన తలమీద పెట్టుకొని వీధివీధికీ వస్తున్నాడు. ఘటంరాగానే ఇంట్లో ఆడవాళ్లు అన్నం. పెరుగూ ఆ బానలో వేస్తున్నారు.

ఊళ్ళో జాతరసందడి అప్పుడే కన్పిస్తోంది. ఇంటి గడపలకు పసుపురాసి బొట్లు పెట్టారు ద్వారాలకు తోరణాలు కట్టారు. బజార్లో ఉన్న వేపచెట్లన్నింటికి పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టారు. ఒక్కొక్క వేపచెట్టు ఒక్కొక్క గ్రామదేవతకు నిలయమని వారి నమ్మకం. ముత్యాలమ్మ గుళ్లకి సున్నంకొట్టారు. తోరణాలుకట్టి అలంకారాలు చేశారు. గుళ్లముందు పందిళ్లువేశారు. బొమ్మనిచేసి అమ్మవారిని నిలిపారు. అమ్మవారికి కొత్తచీర కట్టారు. అమ్మవారి కుడిచేతిలో చిన్న కత్తి మెరుస్తోంది. ఆ కత్తికి నిమ్మకాయ గుచ్చారు. పంబలవాళ్ళు, కొమ్ములవాళ్ళు, బైనీడువాళ్ళు అంతా తర్లి వచ్చారు. ఏటవతలి మాతంగికి కబురుపెట్టి పిలిపించారు. మాతంగి జీవితాంతం కన్యగానే ఉండిపోతుంది. కొలుపుల్లో మాతంగి లేకపోతే ఏ పనీ జరగదు. వీరంగం వాయిస్తుంటే. పంబలవాడు శివమెక్కిస్తే మాతంగికి ఒళ్లుపెరిగి చిందు తొక్కుతుంది. ఆ ఆట చూడ్డానికి జనం విరుచుకుపడ్తారు. క్రితం సంవత్సరం వచ్చిన మాతంగి ముసలిది. చనిపోయింది. ఈ మాతంగి మాంచి వయసులో ఉంది. గజ్జలు ఘల్లు ఘల్లుమనిపించుకుంటూ బజార్లోనడుస్తుంటే గుంపు వెంటబడుతోంది.

ఉదయాన్నే కృష్ణనుంచి జలబిందెల ఊరేగింపుతో ముత్యాలమ్మ గుళ్ళదగ్గరికి తీసికెళ్ళటానికి వాద్యగాళ్ళు. మాతంగి. ఊరేగింపు జనం అంతా మల్లయ్యరేవులోకి వచ్చారు. వస్తూ వస్తూ కేశవులింటికి కబురు చేశారు. కేశవులు ఆ వూరికి పెద్దకాపు. కొలుపులు పెద్దకాపు అజమాయిషీ కింద జరగటం మొదట్నించీ వస్తున్న ఆచారం. కేశవులుకూడా అందరితోటీ స్నానాలు చేశాడు. నీళ్ళుకారుతున్న తడిబట్టలతో ఒడ్డుకొచ్చి జనమంతా నుదుటికి పసుపు కుంకం రాసుకున్నారు. కేశవులు వద్దంటున్నా. పంబలవాడు అతని ముఖంనిండా కుంకం మొత్తాడు. మాతంగి ముఖంనిండా పసుపు రాసుకుంది. రూపాయికాసంత (నాగరమంత) కుంకంబొట్టు పెట్టుకుంది. స్నానాలు చేసిన వాళ్ళందరికి గుగ్గిలంపొగ వేశారు.

కేశవులు బిందెనిండా నీళ్ళు నింపి “జై ముత్తాలమ్మ తల్లీ” అంటూ పెద్ద గొల్ల నెత్తికెత్తాడు. డప్పులు ఫెళ ఫెళా మోగాయి. హహహహ....హహో అంటూ మాతంగి ఒళ్ళు విరుచుకుంది. బైనీడువాడు జమిలిక ఆవేశంగా వాయిస్తున్నాడు. మాతంగికి శివమెక్కిస్తూ కొమ్ములవాడు కొమ్ము పూరించి వూదాడు. పంబలవాడు పంబజోడు ఊపులో వాయిస్తూ 'ఖళేజోగా' అని అరిచాడు. ఆ అరుపులో ఉన్నశక్తి ఏవిటో అందరికీ ఛెళ్ళున చరిచినట్లయింది. ఆవేశం పెల్లుబికింది. మాతంగి చెంగున గుంపు మధ్యకి దూకి ఆట ఆరంభించింది. అదిచూసి మిగతా జనం అందరూ తందనాలు తొక్కుతున్నారు. గణాచారి శరీరం మీద వీరతాళ్ళు ఛడేలున మోగుతున్నాయి. వేపమండలు గాలిలో ఎగురుతున్నాయి. ఒక వెర్రి ఆవేశంలో ఒళ్ళు తెలియకుండా ఆడే ఆటలో, చిన్న కుంభకోణం చెంబుతో నీళ్ళు బుజాన పెట్టుకుని, చాలీచాలని గోచి కట్టుకుని గంతువేసే ఆ పదేళ్ళ గొల్లపిల్లాడు కూడా అడుగు తప్పటంలేదు. తాళం బెసగటంలేదు. డప్పు దెబ్బకు దెబ్బగా అడుగు అడుతోంది. నీళ్ళోడుతున్న బట్టలతో, బుజాలమీద బిందెలతో ఊరేగింపు బయలుదేరింది. ఊరేగింపు గాలిగోపురం దాకా సాగనంపి. కేశవులు వెనక్కు వచ్చేశాడు.

ఇంటికొచ్చి ఒంటినున్న తడిబట్ట నీళ్ళు పిండుతూ 'పెద్దో దొచ్చేవేళ కాలే' అని అడిగాడు కేశవులు.

“ఆ! రావొద్దూ. కారు దొరికిందో లేదో” అంటూ భార్య రాజమ్మ పొడి ధోవతి కేశవులుచేతి కందించింది.

రాముడు కేశవులు పెద్దకొడుకు. పట్నం కాలేజీలో చదువుతున్నాడు. రెండో కొడుకు ఆ వూళ్లోనే హైస్కూల్లో చేరాడు.

కాలేజీకి నాలుగురోజులు సెలవు లిచ్చినట్టు. తను బయలుదేరి వస్తున్నట్టు, రాముడు నిన్న ఉత్తరం రాశాడు. కేశవులు రాముణ్ణిచూసి చాలా కాలమైంది. రాముడు జ్ఞాపకం వచ్చినపుడల్లా కేశవులికి మనసు గుబులు గుబులుగా ఉండేది. అక్కడ వాడికెవరు? అయ్యా, అమ్మా? ఎట్లా ఉన్నాడో పిచ్చిసన్నాసి' అని లోపల అనుకొనేవాడు కేశవులు. సరిగ్గా అవే మాటలు బైటకనేసేది రాజమ్మ. కొడుకు రాకకోసం వాకిట్లో అరుగుమీద కూర్చొని ఎదురు చూస్తున్నాడు కేశవులు. వీధి మలుపున ఎవరో సూటు, బూటు వేసుకొని సామాను కూలీచేత పట్టించుకొనివస్తుంటే 'తాశీల్దారు గామోసు' అనుకున్నాడు కేశవులు. కాని ఆ వచ్చేది తాశీల్దారు కాదు. రాముడు. రాముడే!

సత్యం శంకరమంచి

నవ్వుతూ అన్నాడు 'నీళ్ళెందుకు సరిపడవమ్మా!' అన్ని నీళ్ళు ఒకటేగా.'

'నీ మొహంలేరా! నీకేం తెల్సు. ఆ కళ్ళచూడు, ఎట్లా లోతుకు పోయాయో' అంది రాజమ్మ.

'తీరిగ్గా తర్వాత మాటాడొచ్చుగాని వేన్నీళ్లు తోడవే' అన్నాడు కేశవులు.

'అట్లాగే. తుండుగుడ్డలు మధ్యయింట్లో ఉండాయి కట్టుకు దొడ్లోకి పద 'నీళ్ల తెస్తున్నా' అంది రాజమ్మ.

రాముడు దొడ్లో స్నానం చేస్తుంటే కేశవులు దొడ్డి గుమ్మం దగ్గర నుంచుని అన్నాడు. 'పెద్దోడా! ఊళ్ళో కొలుపులు జరుగు తుండాయి. సాయంత్రం అట్టా వెళ్తావా!'

'ఆ! ఆ! వెళ్తాలే' అన్నాడు రాముడు.

'పట్నంనుంచీ నువ్వొక్కడివేనా, కరణంగారబ్బాయికూడా వచ్చిండా?' అన్నాడు కేశవులు.

'సీతాపతి నేనూ కలిసే వచ్చాం, వాడికూడా సెలవే' అన్నాడు రాముడు.

'అట్టాగయితే ఇద్దరూ కలసి ముత్తాలమ్మ గుళ్ళ దగ్గరికి పొండి' అన్నాడు కేశవులు.



'అట్లాగేలే' అన్నాడు రాముడు.

కేశవులు కొంత దూరం వెళ్ళి వెనక్కు తిరిగొచ్చి 'పెద్దోడా! జాతర దగ్గర మన ఇంటోళ్ళు, ఎవరో ఒకరు ఉండాలి. అది ఆచారం తెలుసుగా. నే పొలం పోతుండా. నే వచ్చేప్పటికి ఆలశ్యమవుద్ది. నువ్వు గుళ్లదగ్గర కెల్లం మర్చిపోయేవు' అన్నాడు.

'మర్చిపోనులేవే. వెళ్తాను' అన్నాడు రాముడు ఒళ్లు తుడుచుకుంటూ.

ఆరోజు సాయంత్రం రాముడు సీతాపతికోసం కరణంగారింటి కెళ్ళాడు. రాముడు

'పెద్దో దొస్తున్నాడే' అని ఇంట్లోకి కేకేశాడు కేశవులు. రాజమ్మ పరుగెత్తుకు బైటికొచ్చింది. 'ఏం అయ్యా! ఇంత ఆలస్యమైందేం?' అంటూ చెంబుతో కాళ్ళ కడుక్కోటానికి నీళ్ళు తెచ్చింది.

'కారు దొరకలేదమ్మా' అంటూ రాముడు కాళ్ళు కడుక్కొని రాజమ్మ అందించిన తుండుగుడ్డతో తడి తుడుచుకున్నాడు.

'అయ్యా! ఇంత చిక్కిపోయినావేంరా' అంది రాజమ్మ. రాముడి ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

రాముడు సమాధానంగా నవ్వాడు.

కేశవులు కొంచెం సన్నబడ్డ కొడుకువంక చూస్తున్నాడు. రాముడిలో కొంత నాజూకుతనం కన్పించింది. కొడుకు వేసికొన్న పూలు పంట్లాము. బూట్లు కేశవులికి కుతూహలం కల్గిస్తున్నాయి. రాముడు తనతో తీసుకవచ్చిన ఇంగ్లీషు పేపర్ని అటూ



ఇటూ తిప్పి చూశాడు.

'చదువు బాగా సాగుతుందా?' కేశవులు అడిగాడు. సమాధానంగా రాముడు తలూపాడు. 'నీళ్ళు సరి పడ్డాయా అయ్యా' అంది వంటింట్లోంచి రాజమ్మ.

ఆ పలకరింపులో ఆప్యాయత అందోళన స్పందిస్తున్నాయి. రాముడు

ఈరోజు. మామూలుగా వేసుకొనే లాగూ, చొక్కా వేసుకోలేదు. ధోవతి కట్టుకుని ఉత్తరీయం వేసుకున్నాడు సీతాపతి రాముణ్ణి కూర్చోపెట్టి కాఫీ ఇచ్చాడు. 'ఏవిటి వేషం మార్చేశావ్?' అన్నాడు సీతాపతి.

"ఊళ్లో కొలుపులు జరుగుతున్నాయి మాది పెద్దకాపు కుటుంబం కదా! అంతా మా ఆధిపత్యంకింద జరగాలట. మానాన్న ఆ భారం నామీద పెట్టాడు!" అన్నాడు రాముడు.

'ఓహో ఇది పెద్దకాపు వేషమా' అన్నాడు నవ్వుతూ సీతాపతి.

'అదికాదురా. మనం సూటు బూటు వేసుకెళ్తే వాళ్లు బెదరిపోతారు. ఏదో పరాయి దేశం వాణ్ణి చూసినట్టు చూస్తారు. భయం భయంగా మాట్లాడతారు' అన్నాడు రాముడు.

'మనం ధోవతి కట్టుకెళ్ళినా, మనతో మనసు విప్పి మాట్లాడరు. పట్నంలో చదువుకుంటున్న మనమంటే వాళ్ళకి భయంతో కూడిన గౌరవం. అయితే నేను కూడా ధోవతి కట్టుకోనా! నాకు చేతగా దెట్లా?' అన్నాడు సీతాపతి.

"తెలుగువాడికి ధోవతి కట్టుకోవటం చేతకాదంటే అంతకంటే సిగ్గుచేటు ఇంకో టుండదు. నేను నేర్పుతాలే ధోవతి బయటికి తియ్యి." అన్నాడు రాముడు. సీతాపతి చేత ధోవతి కట్టించాడు. అది నిలబడటంలేదు. జారిపోతోంది. సీతాపతి ధోవతిపైన బెల్టు బిగించుకొని బయలుదేరాడు.

ముత్యాలమ్మ గుళ్ళు ఇంకా కొంత దూరం ఉన్నాయనగానే రాముణ్ణి. సీతాపతిని ఇద్దరుముగ్గురు 'సిన్నదొరలెప్పుడొ దిగారు?' అని పలుకరించారు.

'ఆ! పొద్దున్న వచ్చాం. అంతా బావు న్నారా?' అనడుగుతూ నడుస్తున్నారిద్దరూ.

"నువ్వు కరణంగారి కొడుకువి నేను పెద్దకాపు కొడుకుని. మనం ఈ ఊరికి దాదాపు నాయకులం కాబోలు" అన్నాడు రాముడు,

"వాళ్లు అట్లా అనుకున్నంత కాలం నాయకులమే. మనం నిజంగా వాళ్ళకి నాయకత్వం వహించిందెప్పుడు.?" అన్నాడు సీతాపతి.

వస్తున్న రాముణ్ణి గుర్తుపట్టిన పంబల వాడు.

'సిన్నపెద్దకాపు వస్తుండాడు' అని అరిచాడు పందిళ్ళలోకి.

'సిన్నపెద్ద కాపేమిటిరా సీతాపతీ?' అన్నాడు రాముడు.

'అంటే పెద్దకాపు కొడుకు. చిన్నవాడు కాబట్టి చిన్నపెద్ద కాపన్నమాట' అన్నాడు సీతాపతి.

'అయితే మా నాన్న పెద్దపెద్దకాపా?' అన్నాడు రాముడు.

'మీనాన్న ఉన్నప్పుడు చిన్నా, పెద్దా ప్రసక్తే లేదుకదోయి' అన్నాడు సీతాపతి.

వీళ్ళిద్దర్నీ చూసి పంబలవాడు 'కానీం డెహె... మొదలెట్టండి' అని అందర్నీ తొందర పెడ్తున్నాడు.

రాముడు సీతాపతీ గుళ్ళన్నీ తిరిగొచ్చారు. అమ్మవారి విగ్రహంలో రౌద్రం ప్రస్ఫుట మౌతోంది కళ్లురుముతున్నాయి. చేతిలో తళతళ మెరిసే బాకు, ఆ బాకుకు గుచ్చిన నిమ్మపండు. రాముడు కళ్లుమూసుకుని నమస్కారం చేస్తూ అనుకున్నాడు. దేవి ఇంతభయంకరంగా ఉందేమిటి? నిత్యమంగళంగా చిరునవ్వు వెదజల్లే అమ్మవారేనా ఈమె? చెడుని చెండాడేటప్పుడు ఆమె ధరించిన అకారం అయ్యుంటుంది. మరయితే ఆమె ప్రసన్న రూపానికి బదులు, చెడుకి చిహ్నమైన ఈ రౌద్రాకారాన్ని పూజించట మెందుకు? కాళీ విగ్రహాన్ని పూజించటంలా, అలాగే ఇదికూడా. ఆమెను గురించి భయపడి జనం సన్మార్గు లవుతున్నారుకాబోలు. దేవి అంటే భయపడి భక్తులయ్యే వాళ్లు కొందరు. దేవియందలి భక్తితో భక్తులయినవారు మరికొందరు. ఈ రెండు మార్గాలు చేర్చేచోటు ఒకటే కావొచ్చునేమో కాని, ఒకమార్గంలో ప్రయాణించే వాడికి రెండోమార్గం నచ్చదు. కళ్లుతెరచి చూశాడు రాముడు. మొదట్లో ఉన్నంత భయంకరంగా లేదు అమ్మవారు. అమరేశ్వరుడి గుళ్లో చాముండేశ్వరి చెల్లెలులా ఉంది. "నేను పొందిన భయం దేవి విగ్రహంలోది కాదు. నా గుండెలోది. అంతా చూడటంలో ఉంది. అనుకున్నాడు రాముడు.

పంబలవాడు రాముడికీ, సీతాపతికీ పెద్ద పెద్ద కుంకం బొట్లు పెట్టాడు. ఇద్దరూ చెరుపుకోకుండా ఉంచుకుందాం అనుకున్నాడు. పందిళ్లలో జనం క్రమక్రమంగా పోగవుతున్నారు. పిల్లలు సంబరాలుగా పందిళ్లనిండా పరుగెడ్తున్నారు. కొంతమంది వాళ్లని అదిలిస్తున్నారు. వాళ్లు అదిలించినకొద్దీ గోల చేస్తున్నారు. ఒకపక్కన తాటాకులు మంటవేసి డప్పులు వేడిచేస్తున్నారు. కాగిన డప్పుల చర్మం బిరుసెక్కి దెబ్బవేస్తే ఖణేలున మోగుతోంది.

వీరాస్వామి. మున్సబు. ఊళ్ళోకొందరు పెద్ద రైతులు పందిట్లోకి వచ్చారు. రాముణ్ణి. సీతాపతిని పలుకరించారు.

'మీ అయ్య రాలేదా రామయ్య' అనడిగాడు మున్సబు.

'లేదండీ కొంచెం పనుందిట, నన్ను పంపించాడు' అన్నాడు రాముడు.

"కొడుక్కి అప్పుడే తర్ఫీదిస్తునాడయ్యోవ్" అన్నాడు వీరాస్వామి.

కల్లుకంపు గప్పుమంది. సీతాపతి ముఖం ఇంకోవైపు తిప్పుకున్నాడు. పందిరి కవతలగా డప్పులు వాయించడం ఆరంభించారు. పది డప్పులు ఒకే బిగిన మోగిస్తుంటే పందిళ్లన్నీ మోగిపోతున్నాయి. ఆ మోతలో ఒకళ్ల కేకలు ఒకళ్లకందక పెద్దగా అరచుకుంటున్నారు. ఆ అరుపులు, కల్లువాసనలు గాలిలో తేల్తున్నాయి,

'ఏరా సీతాపతీ! నీకేవన్నా భయంగా ఉందా?' అన్నాడు రాముడు.

"భయంలేదుకాని, ఈ వాసన కొంచెం దుర్భరంగా ఉందిరా" అన్నాడు సీతాపతి.

"వెళ్దామంటే వెళ్ళిపోదాము" అన్నాడు రాముడు.

"లేదు లేదు. ఉందాం. ఇదివరకు కొలుపు లెప్పుడూ సొంతంగా చూడలేదు. ఏదో పగలు వచ్చి చూసిపోవటం తప్ప. ఈ సారి రాత్రిళ్లుకూడా ఏంచేస్తారో చూడాలని ఉంది" అన్నాడు సీతాపతి.

చీకటి పడింది. పందిట్లో ఆ చివరా ఈ చివరా కాగడాలు వెలిగించారు. మధ్యలో ఒక గుడ్డిలాంతరు వెలుగుతోంది. ముత్యాలమ్మకి ఎదురుగా పందిట్లో పంబలవాడు పెద్దముగ్గు వేస్తున్నాడు. రంగు రంగులుగా ఆ ముగ్గు వేస్తూ ఏదో చదువుతున్నాడు. మధ్య మధ్య గొణుక్కుంటున్నాడు. మాతంగి ఘల్లు, ఘల్లున గజ్జెలు మోగించుకుంటూ పందిట్లో కొచ్చింది. మాతంగి కాళ్ల గజ్జెలమోతవిని చెదురు మదురుగా ఉన్న జనమంతా పందిట్లో కొచ్చారు. మాతంగి వరుసగా అందరికీ దణ్ణాలు పెట్టింది. మున్సబు రాముణ్ణి మాతంగికి చూపిస్తూ 'పెద్దకాపు కొడుకు' అన్నాడు. 'ఓ యబ్బ! పట్నం దొరా!' అని రాముడి మీదికి వంగి చెంపలు రెండుచేతులా తాకి తన కణతలమీద మెటికలు విరుచుకుంది. మాతంగి మెళ్ళో వేసుకొన్న గవ్వలపేర్లు రాముడి గుండెమీద కొట్టుకుంటే ఉలిక్కిపడ్డాడు రాముడు. కల్లుకంపు గుప్పుమంది. చుట్టూవున్న జనం కన్నెమాతంగిని విరగబడి చూస్తున్నారు. అందరి కళ్ళు దానిమీదే. కాగడా వెల్తుర్లో వీరాస్వామి మాతంగిని చూసి కన్నుగీరటం రాముడు చూశాడు. రాముడేవిటి, అంతా చూశారు. 'అయ్యదొరో! మీసాలూడ లాగేను' అంటూ మాతంగి వీరాస్వామి మీసాలు సుతారంగా తాకి పంబలవాడి వైపుకి వెళ్ళింది. జనమంతా పెద్దగా నవ్వారు. వీరాస్వామి సిగ్గుపడలేదు. అందర్నీ చూస్తూ ఠీవిగా మీసం మెలేసుకున్నాడు.

పంబలవాడు ముగ్గువెయ్యటం పూర్తయింది. ముగ్గు చుట్టూ ఏవో గీతలు గీశాడు. ఆ గీతలమీద నిమ్మకాయ్యలు కోశాడు. ఆ రంగు రంగుల ముగ్గులో కొట్టొచ్చినట్టు కనుపించేది ఎర్రటి ఎరుపు. ముగ్గునిండా పసుపు, కుంకం చల్లాడు. తప్పెట్లవాళ్ళని, మిగతా వాద్యగాళ్లని పిల్చాడు. వాద్యగాళ్ళు కొమ్ములు, తిత్తులు, జమిలికలు సరిచేసుకున్నారు. అందర్నీ ఒక్కసారి వాయించమన్నాడు. హోరుమని పందిరిగింగురెత్తేలా మోగాయి వాద్యాలు. 'ఆపండి' అన్నాడు. ఒక్కసారి ఆగిపోయాయి. పెద్దగా ఏవో మంత్రాల్లాంటివి అరుస్తూ చదివాడు. ఆవేశంలో ఊగిపోతున్నాడు.

'పెద్దకాపు దొరా! సెలవా' అని అరిచాడు.

రాముడి ప్రక్కనే కూర్చున్న మున్సబు 'సెలవనవయ్యా రామయ్యా' అన్నాడు.

'ఆ! సెలవు' అన్నాడు రాముడు. అని సీతాపతి ముఖం వంకచూసి నవ్వాడు.

పంబలవాడు వరుసగా అందరి దగ్గర సెలవు అడిగి తీసుకున్నాడు. పోతురాజు బండ దగ్గరకెళ్ళి నుంచున్నాడు.

ఈ దేవతలంతా ఎనిమిది మంది అప్పచెల్లెళ్ళు. మాలక్ష్మమ్మ. పెద్దింటమ్మ. అంకమ్మ. ముత్యాలమ్మ. పోలేరమ్మా. జీలకర్రమ్మ. మెంతులమ్మ. మెడవిరుపులమ్మ - అని. ఈ ఎనిమిది మంది అప్పచెల్లెళ్ళకి ఒకే ఒక ముద్దుతమ్ముడు పోతురాజు. ఈ దేవతల గుళ్ళముందు తప్పనిసరిగా పోతురాజుబండ ఉంటుంది. నైవేద్యాలన్నీ ఈ బండదగ్గిరే చెల్లించాలి.

ఒక్కసారి తప్పెట్లు, తాళాలు, ఫెళఫెళ మోగాయి. పంబలవాడు, గిల గిల కొట్టుకుంటున్న కోడి నొకదాన్ని పోతురాజు బండమీద సర్రున కోశాడు. మొండెం నుంచి చిమ్ముతున్న నెత్తురు ముగ్గుమీద చల్లాడు కోడితల ముగ్గు మధ్యగా పెట్టాడు ఇది చూసి రాముడు, సీతాపతి ముఖం ముఖం చూసుకున్నారు. వాళ్ళ ముఖాలు పేలవంగా ఉన్నాయి. పంబలవాడు పంబజోడు తగిలించుకొని ఏదో పాడుతున్నాడు. మధ్య మధ్య వచనంలా చెబుతున్నాడు. మాతంగికూడా మధ్య మధ్య ఏదో చెబుతూంది. ఆ చెప్తున్నది కొంత తెలుగు కొంత ఏ భాషో అర్థం కావటం లేదు. కాసేపు చెప్పి తప్పెట్లు వాయించమంటున్నాడు. మళ్ళీ ఆపమని, చెప్పటం సాగిస్తున్నాడు. రాముడు ప్రక్కనున్న వీరాస్వామితో 'ఇదింకా ఎంతసేపుంటుంది మావా?' అన్నాడు.

'ఇది ఇప్పు డవుద్దంటరా! నడిజాము దాటుద్ది. మీరు బువ్వ తిని రాలా?' అన్నాడు వీరాస్వామి.

'లేదు' అన్నాడు రాముడు.

'అయితే తినిరారా ఎదవన్నా! మేమంతా సందకాడే తినొచ్చాం. మళ్లా ఎంబడే రండి. ఊరుచుట్టూ తిరగాల. మీలో ఒకళ్ళుండాల. నువ్వు రాపోతే మీ అయ్యని పంపు' అన్నాడు వీరాస్వామి.

రాముడు, సీతాపతి, పందిరి దాటి బైటికొచ్చేశారు. 'నాకు ఒళ్లు గరపొడిచింది. ఇందాక వాడు కోడిని కోస్తున్నప్పుడు' అన్నాడు సీతాపతి.

'నాకూ అట్లాగే అయ్యింది. కాని ఏం చేస్తాం. వాళ్ళ ఆచారాలు వాళ్లవి.' అన్నాడు రాముడు.

'ఏం ఆచారాలురా! గొంతులు కోయటం ఆచారమా? అత్యాచారంకాని,' అన్నాడు సీతాపతి.

'ఇంతకీ మళ్లీ వద్దామంటావా లేదా?' అన్నాడు రాముడు.

'నీ ఇష్టం' అన్నాడు సీతాపతి.

'మనకు మళ్ళీ మళ్ళీ ఇట్లాంటివి చూసే వీలు దొరకదు. మళ్ళీ వద్దాం' అన్నాడు రాముడు.

'సరే నువ్వుకూడ మా యింట్లో భోంచెయ్యకూడదూ?' అన్నాడు సీతాపతి.

'ఏవిటి కూర?' అన్నాడు రాముడు.

'నీకు తెలియదా! వేటని కోశాం' అన్నాడు సీతాపతి.

'మా ఇంట్లో, మీ ఇంట్లో, అట్లాటి కూరలు చేస్తారని ఈ నడిబజార్లో ఎలుగెత్తి అరచినా ఎవరూ నమ్మరు.' అన్నాడు రాముడు నవ్వుతూ.

రాముడు, సీతాపతి భోజనాలుచేసి తిరిగి గుళ్ళదగ్గర కొచ్చేసరికి పది దాటుతోంది. పంబలవాడు కథ ఇంకా చెప్తూనే ఉన్నాడు. పంబలవాడు కథ పూర్తిచేసి అందరికీ బొట్లు పెట్టాడు. కథ పూర్తి కాగానే జనం చాలాభాగం వెళ్లిపోయారు. ఒక వంద మంది మాత్రం పందిట్లో మిగిలారు. కాగడాలకి కొత్త వత్తులు తగిలించారు. తాటాకు మంటవేసి మళ్లీ తప్పెట్లు వెచ్చజేస్తున్నారు. పంబలవాడు ఇందాకటి ముగ్గు మీద మళ్లీ కొత్త ముగ్గులు వేశాడు. ఆ ముగ్గుమీద అన్నం రాశి పోశారు. ఆ ఎర్ర అన్నం రాశి పైన దీపారాధన చేశారు. నల్లటి దున్నపోతుని తాళ్లతో బిగించి కట్టి తీసికొచ్చారు.

'దాన్ని చంపుతారా?' అన్నాడు సీతాపతి రాముడి చెవిలో. రాముడు మాట్లాడక్కర లేదు. దున్నపోతు పక్కనే బుంగ మీసాలతో, తళతళ మెరిసే కొంగాల కత్తితో నుంచున్న ఆ మనిషేసమాధానం. రాముడు, సీతాపతి గుండెలు గబగబ కొట్టుకున్నాయి.

దున్నపోతుకి పసుపు కుంకం రాశారు. కొమ్ములకి నూనె వత్తులు చుట్టారు. దున్నపోతు బెదిరిపోకుండా కాళ్లు, నడుం తాళ్లతో కట్టి ఐదారుగురు బిగించి పట్టుకున్నారు. కత్తి పట్టుకున్న మనిషి కళ్ళు నిప్పుకణికల్లా ఉన్నాయి. దున్నపోతు బుస పెడుతున్నట్టు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు విడుస్తోంది. తన అంతిమ క్షణాలు సమీపించాయని తెలుసో తెలియదో? ఎవరికోసమో కలయవెదుకుతున్నట్టు తల తిప్పి అటూ యిటూ చూస్తోంది. కాని బిగించి పట్టుకున్న పగ్గం తాళ్లు తలని తిప్పనివ్వటం లేదు. ఎదురుగా ఉన్న ఎర్రటి కుంభం పైన వెలుగుతున్న దీపం వైపు చూస్తోంది. ఆ దీపానికి పైగా మసగ వెల్తుర్లో కన్పించే అమ్మవారి వైపు మోర ఎత్తుతోంది.

కత్తి పట్టుకున్న మనిషి రాముడి వైపు చూసి 'సెలవా దొరా! పెద్దకాపుగోరూ' అన్నాడు.

తన ఆజ్ఞమీద యీ దురంతం జరగబోతుందా! తనెట్లు సెలవిస్తాడు? రాముడు మాట్లాడలేదు.

'సెలవనవయ్యా రామయ్యా' అన్నాడు మున్సబు.

రాముడి గొంతు పెగల్లేదు. ఏదో చెప్పబోయిన మాట బైటికి రాలేదు. పెదవులు వణికినై.

'సెలవిచ్చాడు కానియ్యవోయ్!' అన్నాడు వీరాస్వామి.

కొంగాల కత్తి ఎత్తిపట్టి వరుసగా అందరిదగ్గరా సెలవు తీసుకున్నాడు. 'ఎన్ని యేట్లు' అన్నాడు.

'రెండు' అన్నాడు మున్సబు.

'కాదు కాదు రచ్చించాల పోతు మంచి వయస్సులో ఉంది. నాలుగేట్లు దయసేయించాల' అన్నాడు కత్తి పట్టుకున్నవాడు.

'సరే కానీ' అన్నాడు మున్సబు.

తప్పెట్లు విరుచుకు పడ్డట్లు ఒక్కసారి మోగాయి. 'జై ముత్తాలమ్మ తల్లీ' అంటూ కొంగాల కత్తిని పైకెత్తి బలంగా విసిరాడు. దున్నపోతు తల సగం తెగింది. గిజ గిజ తన్నుకొంటున్న దున్నపోతుని కదలకుండా పగ్గాలతో బిగించి పట్టుకున్నారు. రాముడు, సీతాపతి కళ్లు మూసుకున్నారు. తిరిగి వాళ్లు కళ్లు తెరిసి చూసేసరికి దున్నపోతు తల కుంభం రాశిమీద ఉంది. కుంభం ఎదురుగా నెత్తురు మడుగు.

"ఇక పోదాం" అన్నాడు సీతాపతి రాముడి చెయ్యి పట్టుకుని. అతనికి మాట సరిగా రావటంలేదు.

'పద' అంటూ లేచాడు రాముడు.

'యాడికి పోతుండావు రామయ్యా. పొలిమేర కాడి కెళ్లి రావద్దా' అంటూ లేచి నుంచున్న రాముడి చెయ్యిపట్టుకున్నాడు వీరాస్వామి. రాముడికి ఏం చెయ్యటానికి తోచలేదు. సీతాపతి వైపు చూశాడు. వాళ్లిద్దరికీ ఎప్పుడు ఈ వాతావరణంల్లోంచి బయట పడదామా అని ఉంది. వాళ్లిద్దరూ మాట్లాడుకోవటంలేదు. మధ్యమధ్య ఒకళ్ల నొకళ్లు చూసుకుంటున్నారు. భయం, భీభత్సం, బాధ మెలేసుకొని, వాళ్ల మనస్సుల్లో వలయాలుగా తిరుగుతోంది. రాముడికి అక్కడ ఉండక తప్పలేదు. లేచినవాళ్లు మళ్లీ కూర్చున్నారు.

ఒక చేటలో కుంభంపోసి దానిమీద తెగిన దున్నపోతు తలపెట్టి. ఆ చేటను. బైనీడువాడి తలకెత్తారు. కొమ్ములు జమికలు, తప్పెట్లు, ఆగకుండా మోగుతున్నాయి. శక్తి దున్నపోతు తలని తన్నుకపోకుండా చుట్టూ పారాగా జనం నుంచున్నారు. కేకలువేస్తూ గాలిలో కర్రలు టకటకా కొడ్తూ ఊరుచుట్టు తిరగడానికి బయలు దేరారు.

ఈ తతంగమంతా చూస్తున్న రాముడు, సీతాపతి ఒకళ్ల నొకళ్లు అనుకొని మాట్లాడకుండా నడుస్తున్నారు. వాళ్లు మాట్లాడుకున్నా వినిపించనంత గోలగా జనం కేకలు వేస్తున్నారు. అర్ధరాత్రి పన్నెండు దాటింది. ఊరంతా సద్దుమణిగి నిద్రపోతోంది. బజార్లన్నీ జన సంచారం లేకుండా ఖాళీగా ఉన్నాయి. ముందు పంబలవాడు నిమ్మకాయలు కోసి విసిరేస్తూ దోవ తీస్తున్నాడు. ప్రతి గవిడి దగ్గర ఊరేగింపు ఆగుతోంది. పంబలవాడు ఏదోచదివిన తరువాత తిరిగి బయలు దేరుతోంది.

పెద్ద బజారులో ఊరి నడిబొడ్డున ఊరేగింపు ఆగింది దున్నపోతు తలమోస్తున్న వాడు ముందుకు నడవకుండా ఆగి ఊగుతున్నాడు. ఇంకో దున్నపోతుని నడిబొడ్డుకు ఎదురుగా తెచ్చారు. వెనక వాడే కొంగల కత్తి ఝళిపిస్తూ, 'పెద్దకాపూ సెలవియ్యి' అన్నాడు. రాముడి కీతడవ తల తిరిగింది. మత్తుగా తనలో నిద్రపోతున్న శక్తి ఉవ్వెత్తున లేచింది. జనమంతా

పెద్దగా అరుస్తున్నారు. ఆ కేకల్లో 'సెలవు లేదు' అని బిగ్గరగా అరిచాడు రాముడు. 'సెలవయింది' కొ°షైయ్' అన్నాడు వీరస్వామి. దున్నపోతు తల మొండెం నుంచి వేరయింది నెత్తురు మడుగుమీదుగా ఊరేగింపు నడిచి వెళ్ళింది.

రాముడు తూలిపోతూ సీతాపతిని పట్టుకు నడుస్తున్నాడు. 'నీ సెలవు నామకః మాత్రమే. నువ్వు సెలవిచ్చినా లేకపోయినా వాళ్లు చంపేది చంపేదే' అన్నాడు సీతాపతి. ఊరేగింపు జనమంతా రాక్షసుల్లా కన్పిస్తున్నారు. వాళ్లువేసే కేకలు, అరుపులు దుస్భరంగా ఉన్నాయి.

ఊరి పొలిమేరమీద దున్నపోతు తల వదలి దీపాలార్పుకుని,ఎవ్వరూ మాట్లాడకుండా వెనక్కుతిరిగి వస్తున్నారు. సద్దు చేసినా. దీపం వెలిగించినా, సాగనంపిన శక్తి తిరిగి ఊళ్లోకొస్తుందిట. ఇలా కొలుపులు నాలుగు రోజులూ సాగనంపుతారు. నిశ్శబ్దంగా ఊళ్లోకి నడుస్తూ. రాముడు, సీతాపతి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ఈ రోజు జరిగిన సంగతులు గురించి. ఊళ్ళోకి ప్రవేశించాక రాముడు వీరస్వామి నడిగాడు. 'ఇంకా ఎన్ని రోజులిట్లా జరుగుతుందిమామా?'

'ఇయ్యాళేముందిరా ! రేపుకదా బోనాలు రేపు ఓ యాభై దున్నలు ఓ ఎంద యేటలన్నా తెగాల. రాముడి గుండె గతుక్కుమంది. 'వెళ్ళొస్తాం మావా' అని చెప్పి జనాన్ని తప్పించుకొని దోవ తీశాడు. రాముడు. సీతాపతి ఎవరిళ్లకు వాళ్లు పోలేదు. అమరేశ్వర దేవాలయ ప్రాకారంలోకి వచ్చారు. అక్కడి కల్యాణ మంటపంలో కూర్చున్నారు.

'చూశావురా ! మన బతుకులెట్లా ఉన్నాయో' అన్నాడు రాముడు.

'కళ్ళారా చూశాను' అన్నాడు కిందికి చూస్తూ సీతాపతి.

'అడవుల్లో ఉండే రోజులకీ, ఈనాటికి మనలోతేడా ఏముంది?'



"ఆవులు, గేదెలు, కుక్కలూ ఇలాంటి పెంపుడు జంతువుల లెక్కలు తీయమన్నారమ్మా:. ఇంట్లో ఏవేవి ఎన్నెన్నో...."

"బాగ్గానే అడిగేవు; అలాంటి జంతువులేవీ లేవుగాని. సూడు బాబూ ! అయ్యన్నీ మాసంసారం తినే పెరుగుతున్నాయి ! అయ్యెన్నుంటయ్యో నువ్వే లెక్కెట్టుకొని రాసుకో !"

'అప్పుడు ఆకులు కట్టుకునే వాళ్లం ఇప్పుడు తెల్లటి యిస్త్రీ చొక్కాలు వేసుకోటంలా?'

'ఆ! అట్లాగేఉంది. వేషం మారింది మనసుమాత్రం ఎప్పటి గంద్రగొడ్డలే'

'మనిద్దరం ఈ బలి ఆపించగలమా?'

'లాభంలేదు. ఊరంతా ఎదురు తిరుగుతుంది. నాకో ఆలోచన తట్తోంది. పట్నం వెళ్ళి జీవకారుణ్య సంఘం వాళ్లకి ఈసంగతి తెలిచేయస్తే?

'చేస్తే వాళ్లేమన్నా పోలీసులా ఆపించటానికి?'

'పోలీసుల చేత నేమవుతుంది?. అయితే వాళ్ల వల్లే కావాలి. వెనక రెండుమూడు చోట్లు, వాళ్లు వెళ్లి జంతుబలి ఆపుచేయటం నేను విన్నాను.'

'వాళ్లకీ అర్ధరాత్రి కబురెట్లా అందుతుంది?'

'చూద్దాంపద' ఇద్దరూ మంటపంలోంచి లేచారు.

బజార్లో సరుకులు వేసుకొని పట్నం బయలు దేరబోతున్న లారీ కన్పించింది. 'సీతాపతి' 'నువ్వు లారీలో వెళ్ళు. నే వెళ్తే మా నాన్న అనుమానిస్తాడు. నువ్వు తిరిగి పొద్దున ఫస్టు బస్సులో వచ్చేయాలి. నువ్వొచ్చేదాకా నామనసు బావుండదు.' అన్నాడు రాముడు.

లారీలో ఎక్కికూర్చున్న సీతాపతితో ఆఖరి మాటగా అన్నాడు రాముడు 'కొన్ని వందల అమాయక ప్రాణాల్ని రక్షించడం ఇప్పుడు నీ మూలంగా జరగబోతూంది. ఎట్లా నిర్వహించుకు వస్తావో! లారీ రొద చేసుకుంటూ వెళ్ళిపోయింది. రాముడి మనస్సు కొంత తేలిగ్గా ఉంది. ఆరాటంగా కొట్టుకుంటూంది. నెమ్మదిగా అడుగులేసుకుంటూ ఇంటికొచ్చి పడుకున్నాడు. నిద్ర పట్టలేదు. కళ్ళముందు తెగిన దున్నపోతు తలలు, నెత్తురు వరదలు.

ఉదయం పది గంటలవుతోంది. పట్నం వెళ్ళిన సీతాపతి తిరిగి రాలేదు. రాముడి మనస్సు మనస్సులో లేదు. పందిళ్ళ చుట్టూ తిరుగుతున్నాడు. అప్పుడే పది దున్నపోతుల్ని రావిచెట్టు దగ్గరికి తీసుకొచ్చారు. వాటికి పసుపు, కుంకంరాసి మెళ్లో దండలు వ్రేలాడదీశారు. కొద్ది క్షణాల్లో ప్రాణాలు పోగొట్టుకోబోయే ఆ పశువులు దీనంగా

చూస్తున్నాయి. అంతిమ ప్రార్థనల్లా మొర ఎత్తి అరుస్తున్నాయి. రాముడికి నెత్తురు ఉడుకుతోంది. అటూ ఇటూ పరుగెత్తుతున్నాడు. మాటిమాటికి రోడ్డు వైపు చూస్తున్నాడు. పదిన్నర దాటుతోంది. కొంగాల కత్తికి పదును పెట్టారు. జనం పోతు రాజు బండ దగ్గర కూడుతున్నారు. రాముడు గిజగిజలాడుతున్నాడు. మున్సబుని పందిళ్ళ అవతలికి తీసుకెళ్ళి 'ఈ బలి ఆపుచేయి మావా? అన్నాడు దీనంగా. మున్సబుకి రాముడి బాధకాని ఆ మాటల్లోని దీనత్వం గాని అంతుపట్టలేదు. ఇంకోరకంగా అర్థమైంది.

'మీ మొక్కుబడి ముందు సెల్లించాలంటావా? అది కుదర్దురా రామయ్యా! ఆచారం ఆచారమే. మీరెంత పెద్దకాపులైనా ముందు జమీందారు గారి పోతు నేసిం తరువాతనే మీది.' అన్నాడు మున్సబు.

'అది కాదు మావా! మొత్తం బలి ఆపించరాదా?' అన్నాడు రాముడు.

మున్సబు తెల్లబోయి గుడ్లు మిటకరించాడు. 'చెంపలేసుకోరా ఎదవనాయాలా కళ్ళు పోతాయిరా! అయ్యేం మాటర్రా పెద్ద కాపింట్లో పుట్టి అమ్మోరు నలచక తింటదిరా!' అంటూ అక్కడ నుంచోకుండా చరచరపందిళ్ళలోకి వెళ్ళిపోయాడుమున్సబు.

రాముడికేం చెయ్యాలో తోచలేదు. గబగబా రావిచెట్టు దగ్గరికెళ్ళి దున్నపోతుల కట్టుడు తాళ్ళువిప్పి. ఆ పలుపుతో దున్నపోతుల్ని అదరించి వదిలేశాడు, జైలు తలుపులు విడిపోయినట్లు. కట్లు తెగగానే దున్నపోతులు సంతోషంగా ఎగిరి దూకి పరుగు లంకించుకున్నాయి. పందిళ్ళలో జనమంతా గోలగా అరుస్తూ ఒక్కసారి లేచారు. కొంతమంది పరుగెత్తుతున్న దున్నపోతుల వెంటబడి కొన్నింటిని పట్టుకున్నారు.

'అపశారం జరిగిందో' పంబలవాడు వేస్తున్న ముగ్గులు ఆపి లేచి నుంచుని అరిచాడు. మాతంగి విసవిసా చిందులు తొక్కుతుంది. గణాచారి వేపాకులు నమిలేస్తున్నాడు. అమ్మవారు ఒంటిమీదకు వచ్చింది. "నాకన్నాయం చేస్తార్రా! నా పోతుల్ని యిడిసి పెడ్తార్రా! నాకు ఆక లేస్తోందిరో! అసలు ఈ ఏడు కల్లు ముంతలు తక్కువయినాయిరో! నాకు దాహ మేస్తోందిరో! కల్లు తెప్పించండర్రో! మిమ్మల్ని తినేస్తారో! నేను ఊరి మీద పడతారో! ఇంక నాశనమేరో! అంటూ గణాచారి ఊగిపోతున్నాడు. గణాచారిని శాంతింప జేయడానికి గుగ్గిలం పొగ వేస్తున్నారు. వీరాస్వామి. మున్సబు యింకా కొంతమంది గణాచారికి దణ్ణంపెట్టి 'తప్పయింది తల్లీ! రచ్చించాల. సిన్నోడు తెలియక సేసిండు. అపరాదంగా ఇంకో దున్నపోతుని బలిస్తాం తల్లీ! మమ్మల్ని రచ్చించు' అంటూ గణాచారి కాళ్ళా వేళ్ళ పడ్డారు.

'పోతులు సరేరో! నా కల్లుముంతర్రా' అన్నాడు. ఇంకా ఊగిపోతూ గణాచారి.

'ఇప్పుడే తెప్పిస్తాం తల్లీ! ఇప్పుడే పంపిస్తాం.' అన్నాడు వీరాస్వామి భయం భయంగా.

గణాచారి కొంత శాంతించాడు. ఊరంతా గప్పుమంది; పెద్దకాపు కొడుకు బోనాలు జరగనియ్యకుండా ఆపేయి స్తున్నాడని. జనమంతా గుళ్ళవైపు పొర్లిపడ్డారు. వాళ్ళందరి మనస్సుల్లో ఒక రకమైన భయం ప్రవేశించింది.

'ఇంత సిత్రం మే మెప్పుడూ ఎరగవే.'

'ఇదేదో ఊరికి చేటొచ్చింది. ఇంత అద్దంతరంగా ఎప్పుడైనా కొలుపులు ఆగినాయంట్రా.'

'అమ్మోరుకి కోపమొచ్చిందిలేవే. ఇంకీ వూర్ని నమిలి మింగేస్తుంది.

'అసలు విఘ్నం రానేకూడదే. వస్తే ఈ ఊరోళ్ళంతా మసే.'

'ఇట్లా రకరకాలుగా మాట్లాడుకుంటూ ఆడా మగా పిల్లలతో సహా గుళ్ళదగ్గిరికి చేరారు.

పారిపోయిన దున్నపోతుల్ని పట్టుకొచ్చారు. దున్నపోతులు ఆయాసంగా రొప్పుతున్నాయి. రాముడికి వాటిని చూస్తే గుండె తరుక్కుపోతోంది. పోతురాజు బండని బలికి సిద్ధం చేస్తున్నారు.

'ఏమైనా సరే బలివ్వటానికి వీల్లేదు' ముందుకు దూకాడు రాముడు.

'ఏందిరా నీ పిల్ల సేట్టలు! ఇందాక నువ్వుచేసినపనికే అమ్మోరు మండిపోతంటే ఇప్పుడిదా! ఫో అవతలకి' రాముణ్ణి చేత్తో నెట్టేశాడు. మున్సబు.

"అంతా అబద్ధం నోరులేని జంతువుల్ని చంపితే అమ్మవారు సంతోషిస్తుందా!" అన్నాడు రాముడు.

'ఓస్ ఆగరా! నిన్న పుట్టినోడివి మాకు పెద్ద సెప్పొచ్చావు! తప్పుకో' అన్నాడు వీరాస్వామి.

'ఏమైనాసరే బలి జరగటానికి వీల్లేదు' మొండిగా అక్కడే నుంచున్నాడురాముడు.

'వీల్లేదేం? అడ్డమొచ్చిన వాళ్ళనికూడా తెగేస్తాను రండిరా!' అంటూ పైపంచె దులిపి నడుముకి చుట్టాడు వీరాస్వామి.

'ఇస్తావేం? మనుషుల్ని కూడా బలిస్తావా? అంటూ ముందుకు దూకాడు రాముడు.

'ఒకలెక్కా ఏందిరా పిల్లసన్నాసీ! యేటలు తెగాల్సిందే. అడ్డమొచ్చినవాడి తలకాయెగిరి పోతది చెప్తన్నా' అంటూ వీరాస్వామి ఊగిపోతున్నాడు. అతడి కళ్ళు నిప్పుకణికల్లా మండుతున్నాయి.

'అణ్ణి లాగిపారేసి, దున్నపోతుని తెగెయ్యండిరా' అంటూ గుంపులోంచి ఎవరో అరిచారు.

'లాగెయ్యండి! అణ్ణి లాగెయ్యండి: అంటూ జనం పెద్దగా కేకలేస్తూ తోసుకొస్తున్నారు.

'నా ప్రాణాలు పోయినాసరే నే నిక్కణ్ణించిపోను. బలివ్వటానికి వీల్లేదు.' అని

పోతురాజు బండమీద నుంచున్నాడు రాముడు.

గుళ్ళదగ్గర గొడవ జరుగుతూందని తెలిసిన కేశవులు ఉరుకులు పెట్టుకుంటూ, జనాన్ని తోసుకొని పందిళ్ళలో కొచ్చాడు. 'ఒరేయ్! రాముడూ! నువ్వింటికి పోరా' అన్నాడు ఒగురుస్తూ.

'పెద్దకా పొచ్చిండు....ఇంక పర్వాలేదు' జనం గుసగుసలుగా అనుకున్నారు.

'నిన్నేరా రాముడూ! ఇదంత్రా, నువు చేసే నిర్వాకం పోరా యింటికి' గదిమాడు కేశవులు.

'నేను పోతాను గాని బలి జరగటానికి వీల్లేదు నాన్నా!' అన్నాడు రాముడు తలొంచుకుని.

'ఏడిశావ్! మనం పెద్దకాపులం దగ్గిరుండి జాతర చేయించరా అంటే, ఇంత అల్లరి పెడ్తావట్రా? ఇదంట్రా నీ చదువు?' అన్నాడు కేశవులు.

'బలివ్వటం అన్యాయం నాన్నా!'

'ఏందిరా అన్నాయం? నువ్వింతమంది పెద్దోళ్ళకి సెప్పేంత మొగోడివా ఎందిరా?'

మీరెంత పెద్దవాళ్ళయిన ఇది అన్యాయం ....నీచం....రాక్షసం....'

'ఛ.. దొంగనాయాల' ఛెళ్లున లెంపకాయ కొట్టాడు కేశవులు.

రాముడు పోతురాజు బండమీంచి కిందికి పడ్డాడు. జనం హాహా కారాలు చేశారు. కేశవులు గుండె కలుక్కుమంది. 'ఏంది కొడుకు నిట్టు కొడ్తిని?' అనుకున్నాడు. 'అమ్మోరి కొలుపులికి అడ్డమొచ్చి నోడుకొడుకా? కొరివా?' అనుకున్నాడు దెబ్బకి తూలిపడ్డ రాముడు లేచి నుంచున్నాడు. అతనిలో ఇప్పుడు ఒకరకమైన మనస్థైర్యం కుదురుకుంది. అతనికి తండ్రితో పోట్లాడు తున్నాననే సంకోచం కలుగలేదు.

మీరు నన్ను కొట్టినాసరే, ఏం చేసినా సరే 'ఇక్కడివాళ బలి జరుగనివ్వను.' అన్నాడు రాముడు.

గణాచారి లేచి మళ్ళీ పెదబొబ్బలు పెడ్తూ ఊగుతున్నాడు. 'అపశారం .. అపశారం' అంటూ జనమంతా గోలగా లేచారు. అంతా భయంతో వణికి పోతున్నారు.

'ఊరికేమువొప్పొంచిందిరో బాబూ' అంటూ గుండెలమీద చేతులు పెట్టుకున్నారు. గుమిగూడినజనం.

'ఏం పెద్దకాపోయ్! ఇదేనా పెద్దరికం? కొడుకాడే ఆటలు సూస్తూ ఊరుకున్నాడు. ఇంకోడయితే తోలు వొల్చేయం!' అనుకుంటున్నారు జనం.

కేశవులికి ఆమాటలు ములుకుల్లా తాకుతున్నాయి. తన తరతరాల ప్రతిష్ఠ ఈ రోజుతో బూడిదై పోతున్నట్లనిపించింది. తనవంశానికి మచ్చ కలిగించే పని, తనీవూళ్ళో ఇంక తలెత్తుకు తిరగలేని పని జరుగుతున్నట్లనిపించింది. కేశవులు కోపంతో గణాచారిని మించి ఊగిపోయాడు, 'ఒరేయ్! ఆణ్ణి కాళ్ళూ చేతులూ కట్టి అవతల పారెయ్యండ్రా' అని పెద్దగా అరిచాడు. అనటమే తడవుగా నలుగురు రాముణ్ణి విరిచి పట్టుకొని అవతలకి మోసుకెళ్లారు. పందిళ్ళలో జనం కేకలుగా అరుస్తున్నారు.

'ఇక తెండ్రా పోతుల్ని' అన్నాడు కేశవులు. అతని కళ్ళలో ఒకదీక్ష మండుతోంది. పంబలవాడు కొంగాలకత్తి పైకెత్తి ఆడిస్తూ గలగలా నవ్వాడు. మాతంగి నవ్వుతూ మువ్వల మోతగా చిందులు తొక్కింది. తప్పెట్లు పందిళ్లు ఎగిరిపోయేటట్లు మోగాయి. పూరించి ఊదిన కొమ్ముల ధ్వని తాటిచెట్టు చిటారు కొమ్మ నంటింది. జనమంతా సంతోషంగా అరుస్తున్నారు అంతా జేలుకొడ్తున్నారు. పెదకాపు కేశవులువైపు చూస్తూ తమ సంతోషాన్ని ప్రకటిస్తున్నారు. కేశవులు తనధర్మం చేస్తున్నప్పుడు కలిగే తృప్తి అనుభవించాడు. గర్వంగా మీసం మెలేస్తూ 'ఏందిరా ఆలీసెం? తెండిరా పోతుని అన్నాడు.బిగియ కట్టిన దున్నపోతుని, పోతురాజు బండ దగ్గరకి తీసికొచ్చారు. అంతలో ఒకలారీ దూసుకొచ్చి పందిళ్ళపక్కగా ఆగింది. దాన్నిండా ఉన్నజనం కిందికి దూకి గబగబా పందిళ్లవైపు వచ్చారు. పందిళ్లలో జనమంతా విస్తుపోయారు. ఎక్కడి వాద్యాలక్కడ ఆగిపోయినాయి. ఆ వచ్చినజనం నలభై మంది పైగాఉన్నారు. అందులో ఐదారుగురు ఆడవాళ్ళుకూడా ఉన్నారు. వాళ్ళు గబగబా పోతురాజు బండ దగ్గరికొచ్చి దున్నపోతుని కావలించుకున్నారు. పంబలవాడు ఎత్తిన కొంగాల కత్తి కిందికి దించాడు. కేశవులు పట్నం జనంతో వచ్చిన సీతాపతిని చూశాడు. వీళ్లకి కబురుపెట్టి పిలిపించింది రాముడు, సీతాపతేనని కేశవులికి వూరి పెద్దలకి అర్థమైపోయింది. వాళ్లకేం చేయటానికి తోచలేదు. కేశవులు సంబాళించుకుని ముందుకొచ్చాడు. 'ఎవరయ్యామీరు? తప్పుకోండి' అన్నాడు. జీవకారుణ్య సంఘం నాయకుడు సింగు ముందుకొచ్చి 'మేము తప్పుకుంటాం దయచేసి జంతువుల్ని బలివ్వకండి' అన్నాడు వినమ్రంగా.

"నువ్వు మాకు చెప్పేదేందయ్యా! తప్పుకో?" అన్నాడు మున్సబు.

'నిజమే మీకు చెప్పేంత పెద్దవాళ్లం కాదు. కాని నోరులేని పశువుల్ని నిలువునా చంపటం న్యాయమా చెప్పండి?' అన్నాడు సింగు.

'నీకేం తెల్సయ్యా? నెత్తురు వరదపారితే గాని అమ్మోరి దాహం తీర్దు. తప్పుకో! సూస్తావేంరా గుడ్లప్పగించి. తెగెయ్యరా దున్నపోతుని' అంటూ బైనీడువాణ్ణి పురమాయించాడు మున్సబు.

బైనీడువాడు ఆవేశంగా కొంగాలకత్తిని పైకెత్తాడు.

'మీ అమ్మవారికి నెత్తురేగా కావాల్సింది? అయితే నన్ను బలివ్వండి' అంటూ మెడని దున్నపోతుకి అడ్డంగా పెట్టాడు.

బైసీడువాడు ఎత్తిన కొంగాల కత్తిని ఎత్తినట్లే ఉంచాడు.

సింగు మళ్లీ తలపైకెత్తి 'ఊ' కొనివ్వండి. ఎందుకు ఆలోచిస్తారు? నేను మనిషినని, నేను మీలాగా మాట్లాడుతున్నానని, అట్లాంటి నన్ను బలివ్వటం అన్యాయం అనుకుంటున్నారు కదూ? మరి ఆ మాట్లాడలేని పశువుని బలివ్వటం న్యాయంగా ఉందా?' అన్నాడు సింగు.

పందిళ్లలో జనం రభసగా తొక్కుకుంటున్నారు. 'పోతు తెగాల్సిందే' అంటున్నారు.

'నాతల నరికి పోతుని తర్వాత నరుకు' అంటూ సింగు పోతుమెడ కడ్డంగా తలపెట్టి వంగాడు.

'ఇద్దర్నీ ఒక్కయేటున నరుకుతా' అంటూ పంబలవాడు కొంగాల కత్తిని పైకెత్తాడు. పిల్లలంతా కెవ్వున అరిచారు. ఆడవాళ్ళు గొల్లున ఏడవటం మొదలెట్టారు. జనంలోంచి కొందరు తోసుకొచ్చి పంబలవాణ్ణి అవతలకు నెట్టేశారు. కొంగాలకత్తి దూరంగా వెళ్లి పడింది. ఇదిచూసి గణాచారికి శివమెక్కింది. 'ఒరే నేను ముత్తాలమ్మనిరా?....నా కన్నాయం చేస్తార్రా' అని ఎగురు తున్నాడు. గణాచారికి అమ్మవారు ఒంటిమీదికి రాగానే జనం సద్దుమణిగింది. అందర్నీ భయం చుట్టుకొంది. 'రచ్చించు తల్లీ' అంటూ చేతులెత్తి దణ్ణాలు పెడుతున్నారు.' నాకు పోతుల్నివ్వరా! నాకు ఏటల్నివ్వరా! మిమ్మల్నిందరినీ మింగేస్తారో! ఊరు నాశనం చేస్తారో ... నా కాకలేస్తోందిరో'. అంటూ తెగ వూగుతున్నాడు గణాచారి.

'శాంతించుతల్లీ! శాంతించుతల్లీ' అని పంబలవాడు పక్కనే సానునయవాక్యాలు పలుకుతున్నాడు.

ఇంతలో జనానికి అమితాశ్చర్యం కలిగే పని ఒకటి జరిగింది. సింగు 'అరెరెరెరె...' అంటూ చెంగున పైకి లేచాడు. సర్రున జనాన్ని దూసుకుంటూ ముత్తాలమ్మ దగ్గరకు పరుగెత్తి అమ్మవారి పాదాలమీద కుంకం గుప్పెటతో తీసుకున్నాడు. మళ్ళీ కేకలు పెడ్తూ పరుగెత్తుకుంటూ పోతురాజు బండదగ్గరికొచ్చాడు. ఆ కుంకం ముఖం నిండా పూసుకున్నాడు. 'నన్ను గుర్తుపట్టలేదంట్రా .... నేను ముత్తాలమ్మని కాదంట్రా' అని గణాచారిని మించి ఊగిపోతున్నాడు. పట్నంనుంచి వచ్చినవాళ్ళు కొందరు మాదిగ వాండ్ల చేతుల్లోంచి డప్పులు లాక్కొని ఫెళ ఫెళ వాయిస్తున్నారు. ఈ కొత్త గణాచారిని చూసి జనం దిగ్భ్రాంతు లయ్యారు. సింగుకు ధూపం వేస్తున్నారు. చెవుల్లో కొమ్ములు ఊదుతున్నారు. వాద్యాలు మోగిస్తున్నకొద్దీ సింగు తెగఊగి పోతున్నాడు. వేపాకులు నమిలేస్తున్నాడు. సింగు వాలకం చూసి గణాచారికి స్వరం తగ్గిపోయింది. పక్కనున్న పంబలాడికి చేతులు చల్లబడినై. మాతంగి నిలువుగుడ్లు వేసి చూస్తోంది. సింగు అరుస్తున్నాడు. 'నాకు పోతుల్ని బలిస్తార్రా.... మీరంతా నా బిడ్డల్రా ..పోతులుకూడా నా బిడ్డలేరా...నా బిడ్డల్ని చంపి నాకు అన్నం పెడతార్రా....ఇంకా ఎంతకాలం సహించనురా...మీరు పెట్టే నెత్తురుకూడు ఇంకా ఎంతకాలం తిననురా.... మిమ్మల్నేంచేస్తే పాపం ఉందిరా. .."

'తప్పయింది తల్లీ! .... తప్పయింది' అంటూ జనం కొందరు లెంపలు వేసుకుంటున్నారు.

కేశవులి హృదయంలో చిత్రమైన సంచలనం కలుగుతోంది. కొలుపుల్లో బలి ముఖ్యమైన భాగం. బలిలేని కొలుపులు వెలాతెలా బోతుంటాయి. అసలిప్పుడు కొలుపులే ఆగిపోయేట్టున్నాయి. పట్నం నుంచి వచ్చిన జనం అందరి దగ్గరికీ వెళ్లి నచ్చచెప్తూ బతిమాల్తున్నారు. తన కుటుంబం అజమాయిషీ కింద జరగాల్సిన జాతర రూపం మారబోతుంది. తన, కొడుకే తన కళ్ల ఎదుటే తనకెదురుగా నుంచుని ప్రతిఘటిస్తున్నాడు. తన కొడుకు చేస్తున్నది నిజంగా తప్పేనా? నోరులేని జంతువుల్ని చంపొద్దొనటంలో తప్పేముంది? మరి కొలుపులు? ఇన్నాళ్ళుగా సాగిన తన కుటుంబ పెద్దరికం? కేశవులు మనస్సు ఎటూ నిర్ణయించుకొలేక పోయింది. 'మా పెద్దోణ్ణి పిలు' అని పక్కవాడితో చెప్పి, పందిళ్ళకవతల, వేపచెట్టుకింద కొచ్చి నుంచున్నాడు.

'ఏందిరా ఈ సొదంతా' తలవొంచుకు నుంచున్న రాముణ్ణి చూసి అన్నాడు కేశవులు.

కేశవులు కొడుకు వైపు సరిగ్గా చూడలేక పోతున్నాడు. ఎప్పుడూ కొట్టి ఎరగని రాముణ్ణి దెబ్బ కొట్టాడు. ఆ ఆవేశంలో చేసిన పని గుండెలో పల్లేరు ముల్లులా గుచ్చుకుంటోంది.

రాముడు 'అవును నాన్నా' అంటూ తలెత్తి చూశాడు. రాముడికి తండ్రి కొట్టాడన్న భావమే లేదు. మామూలుగా నిర్మలంగా ఉన్నాయి కళ్ళు. 'నువ్వు చెప్పు నాన్నా మనింట్లో ఎందుకు మాంసం తినం?' తండ్రినడిగాడు రాముడు. కేశవులింట్లో మాంసం తినరు. ఎందుకుతినరో కారణాన్ని ఎప్పుడూ నోటితో చెప్పుకోవాల్సిన అవుసరం రాలేదు. హృదయానికి తెలుసు తినకూడదని. ఆ నిర్ణయంలో సందేహాలూ లేవు సమాధానాలు లేవు.

'మరి ఇయి అమ్మోరి కొలుపులు గదంట్రా'? అన్నాడు కేశవులు.

'అవును నాన్నా! అయితేనేం? అమ్మవారిని మనం తల్లి అంటున్నాము. మనం అధర్మం అనుకొని వదిలివేశిన పనిని మన తల్లిపట్ల చేస్తే అది ధర్మం అవుతుందా? మనదొడ్లో పుల్లావుకి మనం రోజూ పూజ చేస్తున్నాం. ఆ పుల్లావు జాతిని ఇక్కడ పడేసి నరకటం ఎంత ఘోరం నాన్నా?"

కేశవులికి కొడుకు చెప్పే మాటల్లో నిజం మెరుస్తున్నట్లుంది.

'అది సరేరా! ఈ బలి ఇప్పటి మాటంట్రా మన పెద్దోళ్ళ దగ్గిర్నుంచి రావటంలా?'

'మన పెద్దవాళ్ళకి కొన్ని మూఢాచారాలున్నాయని నువ్వే చెప్పావుగా నాన్నా. ఆ దురాచారాలకు నేనూ సై అంటే నువ్వు నాకు చెప్పించిన చదు వెందుకు? అన్యాయాన్ని అన్యాయం అని చెప్పటంలో తప్పేముంది?'

'వూరంతా ఎదురు తిరుగుతుంద్దెట్లారా?'

'వూరంతా ఎదురు తిరిగినా, మనం న్యాయం కోసం పోట్లాడటం తప్పేముంది? ఎన్ని కష్టాలొచ్చినా ధర్మంగా బతకాలని, ఆ ధర్మంకోసం బతకటంలో ప్రాణాలు పోయినా పర్వాలేదని నువ్వే చెప్పేవాడివి కదా నాన్నా.'

'ఈ ధర్మం నాకింతకాలం తెలీనేలేదేం' అని ఆశ్చర్యపడ్డాడు కేశవులు.

కేశవులికి రాముడిప్పుడు కొత్తరూపంలో కనిపిస్తున్నాడు. తనలోపల బూజు పట్టి మాసిన తెరలు పెటపెట తెగుతున్నాయి. తన నెత్తురు ప్రత్యక్షంగా ఎదుట నుంచుని కొత్త సత్యాలు చెప్తోంది. 'బలి అన్యాయమే' అని నిశ్చయించుకొన్నాడు కేశవులు. రాముడివైపు చూశాడు. తన కొడుకు.... తన చేతులతో పెంచి పెద్దచేసిన కొడుకు నిన్న మొన్న దాకా మాటలు సరిగారాని కొడుకు.... ఎంత పెద్దవాడయ్యాడు! ఎంత మంచివాడయ్యాడు, కేశవులు దేహం ఆనందంగా పొంగింది.

'పద' అన్నాడు కేశవులు, రాముడి భుజంమీద చరిచి.

పందిళ్ళలో జనం కోలాహలంగా ఉన్నారు. పట్నంనుంచి వచ్చిన వాళ్ళందరికీ నచ్చజెప్తున్నారు. పట్నంనుంచి వచ్చిన ఆడవాళ్లు, పందిళ్ళలోని ఆడవాళ్ళదగ్గిరకెళ్ళి 'పశువులు మనింట్లో పాపలనీ, వాటికి మనం నీళ్లు తాగించి, గడ్డివేసి మన బిడ్డల్లా పెంచుకున్నామని, అట్లాంటి వాటిని నరకటం అమ్మవారు సహించలేదని భోదిస్తున్నారు. వాళ్లు చెప్తుంటే అక్కడి ఆడవాళ్ల గుండెలు ద్రవించిపోయినై. 'బలివ్వటం అన్యాయమే' అనుకున్నారంతా.

మొగవాళ్ళలో సగానికిపైగా పట్నం నుంచి వచ్చినవాళ్ళ మాటలు నచ్చాయి. కొంతమంది ఎదురుతిరిగారు. వాళ్లు మొండిగా వీళ్లు చెప్పేవి విన్పించుకోలేదు. వాళ్ళఅహం దెబ్బతింది. 'వీళ్ళు, పట్నపోళ్లు వచ్చి మన జాతరాపేస్తారా?' అన్నది వాళ్ళ గుండెల్లో కసిగా కదుల్తోంది. 'బలియ్యాలంటే యియ్యాల్సిందే' అన్నారు. మిగతా జనం 'ఇయ్యడానికి ఈల్లేవంటే ఈల్లేదు' అని విరుచుకుపడ్డారు. 'ఎవడ్రా నువ్వు చెప్పేదానికి?' అంటే 'నువ్వెవడ్రా చెప్పేదానికి. అంటూ ఒకళ్ల నొకళ్ళు తోసుకుంటున్నారు. కేకలు, తిట్లతో పందిళ్ళు ఊగిపోతున్నాయి.

కేశవులు. వీరాస్వామినీ. మున్సబునీ ఇంకా కొందరు పెద్దల్ని పక్కకి పిలిచి అన్నాడు. 'ఏం జేద్దామయ్యా?'

'ఏందయ్యా చేసేది, బలి జరగాల్సిందే. ఏవూరోళ్లో మనూరికొచ్చి జాతరాపుతుంటే సూత్తూ కూకోటానికి మనవేవన్నా గాజులు తొడిగించుకున్నామంటయ్యా' అన్నాడు మున్సబు.

'వాళ్లు జాత రాపటంలేదు మున్సబూ! బలి మాత్రం ఇవ్వొద్దంటున్నారు' అన్నాడు కేశవులు.

'అదంటానికైనా వాళ్లెవరయ్యా మనకు సెప్పేది. ఆళ్లేం మొనగాళ్లా?' అన్నాడు మున్సబు.

'పోనీ నేనంటున్నాను మున్సబూ? బలి ఆపి మిగతా కొలుపులు సాగిద్దాం' అన్నాడు కేశవులు.

మున్సబు నిర్ఘాంతపోయాడు. 'ఏంది కేశవులూ ఈ కాలపోళ్లలో నువ్వూ కలిసిపోయినావంటే' అన్నాడు మున్సబు అనుమానంగా కేశవులవైపు చూస్తూ.

వీరాస్వామి ఇందాక కేశవులు రాముడు మాట్లాడుకున్న మాటలు విన్నాడు. అతనికి రాముడు చెప్పిన మాటల్లో సబబు కన్పించింది. అతడి మనసు కేశవులు పక్షం తిరుగుతోంది.

'అదికాదు మున్సబూ! ఒక్కటాలోచించు. మన పెద్దోళ్ళు ఎప్పటినుంచో బలులిస్తున్నారు. మనమూ అట్లాగే చేస్తన్నాం. కాని మనకి గొడ్లని నరుకుతున్నప్పుడు లోపల ఏదో బాధగా ఉంటుందంటావా లేదా నువ్వే చెప్పు? ఇయ్యాళ ఈ పోరగాళ్ళు మన మనసులో తిరిగేమాటే బైటికన్నారు దానికంత కోపమెందుకు మున్సబూ?' అన్నాడు కేశవులు.

'నాకేందయ్యా కోపం? రేపు అమ్మోరికి కోపమొచ్చి ఊరిమీద పడి యిరచక తింటే అప్పుడేం చేస్తావయ్యా? పెద్దకాపువి. ఇదేనంటయ్యా చెప్పాల్సిన మాటలు? కొడుకుతో కల్సిపోయి ఊరికి మొప్పం తెస్తావా!' అంటూ కోపంతో ఊగిపోయాడు మున్సబు.

కేశవులు మాట్లాడలేదు. వీరాస్వామి అందుకున్నాడు. 'ఇదుగో మున్సబూ! కేశవులు చెప్పిందే బావుంది. అమ్మోరికి మనం తక్కువ జేస్తామంటే? వేటలకి బదులు బస్తాలు బస్తాలు కొబ్బరికాయలు కొడదాం. గుమ్మడికాయలు పగలేద్దాం. నెత్తురు కూడు అమ్మోరికి మాత్రం ఇష్టమంటావా మున్సబూ'

'అంతే అంతే. కొబ్బరికాయలు కొడ్దాం గుమ్మడికాయలు పగలేద్దాం' అన్నారు పక్కనేఉన్న కొంతమంది.

'సరే మీ ఇష్టమొచ్చినట్టు జేసుకోండి నే పోతున్నా' అన్నాడు మున్సబు.

కేశవులు జనాన్ని తోసుకుంటూ పోతురాజు బండదగ్గరకొచ్చి నుంచుని అన్నాడు. 'ఇయ్యాలనుంచి కొలుపుల్లో బలియ్యటానికీల్లేదు. మన అమ్మోరికి కొబ్బరికాయలు కొడ్దాం. పళ్లు నైవేద్దం పెడ్దాం. మీకందరికీ యిష్టమేనా'

'ఆ! ఇట్టమే' మూకుమ్మడిగా జనమంతా అరిచారు. కొందరు గుసగుసలుగా గొణు

క్కున్న మాటలు ఆ మోతలో అణిగిపో యాయి. సింగు, పట్నంనుంచి వచ్చినవాళ్లు కేశవుల్ని చూసి నమస్కారాలు చేశారు.

కేశవులికి గగుర్పాటు కల్గింది. జన మంతా గుంపుగా వెళ్ళి రావిచెట్టుకి కట్టేసి ఉన్న దున్నపోతుల్ని వేటల్ని తాళ్ళువిప్పి వదిలేశారు. అవి ప్రాణాలు దక్కిన సంబ రంలో చెంగున దూకుతూ తోకలెగరేసు కుంటూ పరుగెత్తుతుంటే చూస్తున్న జనా నికి ఆనందం ఆగిందికాదు. 'జై ముత్తా లమ్మతల్లీ' అని అరిచాడు కేశవులు. ఆ కేక ప్రతిధ్వనులుగా అందరి నోళ్ళా మారు మోగి పందిళ్లు నిండిపోయింది.

కొబ్బరికాయలు బస్తాలు బస్తాలు పగల గొట్టారు. బళ్ళకు బళ్ళు గుమ్మడికాయలు దొర్లినై. పువ్వులూ పళ్ళతో పందిళ్లు నిండినై. పంబలవాడు, గణాచారి వాళ్ళ ముఠా 'మేం జాతర నడిపించం' అనిసమ్మె చేశారు. 'మీరు నడిపించకపోతే నేను నడి పిస్తా' అంటూ ముందుకు వచ్చాడు సింగు వేదోక్తంగా బ్రాహ్మణుడిలా మంత్రాలు చదివాడు. చూసినవాళ్లు పొంగిపోయినారు. కేశవులు దగ్గరుండి అంతా నడిపిస్తున్నాడు.

కొలుపులు చూస్తుంటే జనానికి కొత్త పండగ చేసికొంటున్నట్టుంది. మార్పు అంటే మొదట్లో చాలా భయపడ్డారు. కాని మార్పుని అనుభవిస్తున్నపుడు వాళ్ళు ఒక కొత్త అనుభూతిని పొందుతున్నారు. ఒక నూతనోత్సాహం వాళ్ళ నరాల్లో నర్తిస్తోంది. జనం తండోప తండాలుగా కొలుపులు చూస్తున్నారు.

పంబలవాడు అతని ముఠా 'మేం అమ్మ వార్ని సాగనంపం' అన్నారు. 'మీరు కాక పోతే నేను సాగనంపుతా' అంటూ సింగు ముందు కొచ్చాడు.

జనానికి సింగుమీద గురి ఏర్పడింది. 'ఆ పట్నపోడు పెద్ద మాంత్రికుడంటూరా.. లేకపోతే ఆ గణాచారి పంబలోళ్ళ నోళ్ళు ఇట్టే కట్టేశినాడుగదరా' అని చెవులు కొరుక్కున్నారు.

ఇంతలో పిడుగులాంటి వార్త పందిళ్ల లోకి వచ్చిపడింది. కేశవులు భార్య రాజమ్మ ఉన్నట్టుండి విరుచుకు పడిపోయిందని, మాట రావటంలేదని.

పంబలవాడు లేచి నుంచుని 'తల్లికి బలి ఆపితే ముత్తాలమ్మ ఊరుకుంటదా ఊరు నేలమట్టం చేస్తది' అని అరిచాడు.

జనం గగ్గోలుగా లేచారు. తిరిగి వాళ్లని భయం చుట్టుముట్టింది. కేశవులు రాముడు మరికొందరు ఇంటివైపు పరుగెత్తారు. పందిళ్లలో జనం బలియ్యాల్సిందే. ఇయ్యాళ రాజమ్మ కయింది రేపు మనకవుద్ది' అంటూ లేచారు.

తిరిగి జనం బలి ఇవ్వటంవైపు మొగ్గు తున్నారు. పంబలవాడు మీసం సంతోషంగా మెలేస్తున్నాడు. సింగు బృందానికి ఏం చెయ్యటమో తోచటంలేదు. ఇంతలో కేశవులు, రాముడు, పూజా పళ్లెంతో రాజమ్మ, పందిళ్ళలో కొచ్చారు. జనం సద్దు మణిగి ఆత్రంగా చూస్తున్నారు. ఇంతకూ సంగతేమంటే రాజమ్మకు కొంచెం పైత్యం చేసి ఒళ్ళు తూలిందట. అది కొండంతలుగా పాకిపోయింది. కలతపడ్డ జనం మనస్సులు మళ్ళీ తేరుకున్నాయి.

సింగు తన గడ్డంలోంచి విజయ సూచకంగా నవ్వాడు. పంబలవాడు ముఖం ముడుచుకొన్నాడు. కొంత సేపాగి మిట్ట మీద ఫలానా వారి ఇంట్లో దండెం మీద ఉన్న గుడ్డలు ఉన్నట్టే తగలడ్డాయని వార్త పొక్కింది. ఇంకాసేపటికి గొల్లపాలెంలో ఫలానా వారి ఇంటి కప్పు మీద గప్పున మంట లేచిందని వార్తలు వచ్చాయి. మళ్ళీ పందిళ్లలో కొంత సంచలనం కలిగింది. అంతలో మిట్టమీది వాళ్ళు గొల్లపాలెం వాళ్ళు పందిళ్లలో కొచ్చి మా ఇళ్ళలో గుడ్డలు భద్రంగానే ఉన్నాయని, మా ఇళ్ళ కప్పులు క్షేమంగా ఉన్నాయని, చెప్పటంతో ఇక జనం ఇలాంటి వార్తలకు, బలికి లంకె పెట్టుకొని కలతపడే స్థితి దాటి పోయారు.

సాయంత్రం వేళ కేశవులు ఉరేగింపు లేవదీశాడు. బండిమీద అమ్మవార్ని వేంచేపు చేయించాడు. అమ్మ వారికి అటూ ఇటూ కేశవులు సింగు నుంచున్నారు. రాముడు, సీతాపతి బండి తోల్తున్నారు. బండికి ప్రభలా అలంకారాలు చేశారు. అమ్మవారి బండికి నలభై జతల ఎద్దుల్ని కట్టారు. ఎద్దులకు గులాం చల్లి బంతిపూల దండలు వేశారు. పట్నంనుంచి వచ్చిన వాళ్ళలో కొందరు తప్పెట్లు తీసికొన్నారు. వాళ్ళువేసే కొత్త రకం వరుసలు జనం విరగబడి వింటు న్నారు. కొందరు భజనచేస్తూ ముందుకు సాగారు. 'జై ముత్తాలమ్మ తల్లీ' అరుస్తూ ఊరేగింపు బయలుదేరింది. జనంతో పెద్ద బజారు పొర్లిపోయింది. ఊరికి శివరాత్రి తిరణాల కళ వచ్చింది.

ప్రతి గవిడిదగ్గఱ అమ్మవారి ప్రభ ఆగు తోంది. సింగు కేశవులువైపు తిరిగి 'పెద్దకాపూ సెలవా' అని అడుగుతున్నాడు. అందరి సెలవులూ తీసుకొని గవిడిమీద నిమ్మకాయలు కోయిస్తున్నాడు. గుమ్మడి కాయలు పగలేయిస్తున్నాడు. ఊరేగింపు పొలిమేరదాకా పోయిం తర్వాత అక్కడ అమ్మవార్ని సాగనంపి అంతా భజనలు చేసుకుంటూ వెనక్కు తిరిగొచ్చారు.

ఆరాత్రి కేశవులు పట్నంనుంచి వచ్చిన వాళ్ళకి తనింట్లో భోజనాలు ఏర్పాటుచేశాడు. రాముడికి సీతాపతికి ఆరోజున ఆకలి వేయటంలేదు. ఒకొళ్ళ నొకళ్లు కౌగిలించు కొని నవ్వుకుంటున్నారు. హాయిగానవ్వుకుని ఆనందించని జనం వూళ్లో బహుకొద్దిమంది. అందులో చాలామందికి కల్లుకుండలు చెల్లు బాటు కాలేదన్నదే వారి బాధ.

ఆరాత్రికి రాత్రి పంబలవాడు, అతని ముఠా ఆవూరు పొలిమేర తొక్కమని ఊరు విడిచి వెళ్ళిపోయారు. ఆ తెల్లవారు జామునే ప్రత్యేకంగా లారీ మాట్లాడి.' జయజయ ధ్వానాలతో ఆవూరి ప్రజలు సింగు బృందాన్ని సాగనంపారు.

మర్నాటి ఉదయాన సూర్య కిరణాలు ఆ పల్లెప్రజల్ని మేలుకొల్పుదామని వచ్చినాయి. చిత్రం? వాళ్లు మేల్కొనే ఉన్నారు. ★